
# పెద్దరికం

-ఎ.బి.ఎన్.స్వామి



ఉదయం ఆరుగంటలయింది. వెంకటరామయ్య బద్ధకంగా మంచంమీద నుంచి లేచి కూర్చున్నారు. ఇంతలో పెద్ద మనవడు సందీప్ "తాతగారూ! మీకు ఫోను" అంటూ సెల్‌ఫోన్ ఆయన చేతికందించాడు.

హైదరాబాద్ నుంచి పెద్దకొడుకు సుదర్శన్ తండ్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసాడు. ఇంతలో కోడలు జానకి తెచ్చిన కాఫీ గ్లాసు అందుకుంటూ "అమ్మాయ్! అన్నట్లు ఈ రోజు నా పుట్టినరోజు కదూ. సుదర్శన్ ఫోన్ చేసి శుభాకాంక్షలు చెబితేగానీ నాకు గుర్తుకు రాలేదు" అంటూ కాఫీ తాగి ఖాళీ గ్లాసు ఆమెకందిస్తూ అన్నారు.

"జన్మదిన శుభాకాంక్షలు మామయ్యగారూ..." అంటూ గ్లాసు అందుకుంది. గదిలోంచి బయటకెళుతూ "ఏంటో... ఆయన క్యాంప్‌కి వెళ్లి వారం రోజులయింది. ఎప్పుడొస్తారో ఏంటో... పాపం మామయ్యగారికి ఏమన్నా చేసి పెడదామన్నా సరుకులన్నీ నిండుకున్నాయి. ఖర్చులకు ఆయన ఇచ్చిన డబ్బులు ఎప్పుడో అయిపోయాయి...తనలో తను గట్టిగానే అంది కోడలు.

"పోనీలే అమ్మా.. నాకిప్పుడు 85 సంవత్సరాలు వచ్చాయి. ఇంకా చిన్నపిల్లాడిలా పుట్టిన రోజు పండుగలేమిటి? నువ్వేం బాధపడకు" అన్నారాయన.

వెంకటరామయ్యగారు కాలకృత్యాలు తీర్చుకుని పడక్కుర్చీలో పడుకుని పేపరు చదువుకుంటున్నారు. పేపరు చేతిలో వుందిగానీ ఆయన ఆలోచనలు మాత్రం గడిచిపోయిన తన జీవితాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ గతంలోకి వెళ్లిపోయాయి. తన బాల్యం, కాలేజీ చదువు, ఉద్యోగ ప్రయత్నాలు, గుమస్తా ఉద్యోగం... ఆ తరువాత సంసారం, చాలీ చాలని జీతం, ఐదుగురు కొడుకులను చదివించిన వైనం... వాళ్ల ఉద్యోగాలు, వివాహాలు, రిటైర్ అయిన తరువాత చేతికందిన కొద్దిపాటి డబ్బు... ఇలా అన్నీ సినిమా రీళ్లల్లా ఆయన కళ్లముందు గిర్రున తిరిగాయి.

ఇంతలో ఆయన రెండో మనవడు శ్రీహర్ష "తాతయ్యా...! పక్కింటి తాతగారు మీ కోసం వచ్చారు" అంటూ రివ్వున బయటకెళ్లిపోయాడు. లోపలికొస్తున్న రఘురామయ్యను చూసి "రండి...రండి.. ఇలా కూర్చోండి" అంటూ ఎదురుగా వున్న కుర్చీ చూపించారు.

"అన్నట్లు ఈరోజు మీ పుట్టినరోజుటకదా" అంటూ శుభాకాంక్షలు తెలిపి కాసేపు పిచ్చాపాటి మాట్లాడారు. వెళ్తూ వెళ్తూ... "మీకు అయిదుగురూ కొడుకులే... ఆడపిల్లలు లేరు. బాధ్యతలన్నీ తీరిపోయాయి. అదృష్టవంతులు. మీకింకేం కావాలి?" అని అన్నారు.

వెంకటరామయ్య మళ్లీ ఆలోచనలో పడ్డారు. అవును...తనకు ఇంకేం కావాలి? తన అయిదుగురు కొడుకుల్లో ఒక్కరు కూడా విదేశాల్లో ఉద్యోగాలు చేయకపోయినా తనకేం బాధలేదు. తన పిచ్చిగానీ పిల్లలు రాజస్థాన్‌లో వున్నా, హైదరాబాద్‌లో వున్నా, విజయవాడలో ఉన్నా తనను పలకరించడానికి రావడంలేదని దిగులు పడడం దేనికి? ఏడాదికి ఒక్కసారైనా అందరూ కలసి సరదాగా గడుపుతున్నాముకదా. ఎవరి ఉద్యోగాలు వారివి? ఎక్కడ ఉన్నా వాళ్లందరూ సంతోషంగా ఉంటే అంతేచాలు. వాళ్లు తరచూ రావడం లేదని అనవసరంగా మనస్సు పాడు చేసుకోవడం దేనికి? కలసి ఉంటే కలదు సుఖం... ఇది పాత నానుడి. ఇప్పుడు అంతా పూర్తి వ్యతిరేకం. విడివిడిగా ఉండి ఎవరి బ్రతుకులు వాళ్లు బ్రతకడం, ఎవరి ప్రగతి వారు చూసుకోడం అనేది నేటి పద్ధతి. తన కోడళ్లు తెలివిగలవారు. భవిష్యత్తు ఎలా ఉండాలి, కుటుంబంలో ఎలా మసలుకోవాలి? ఏ ఏ ఖర్చులు చేయాలి, పిల్లల్ని ఎలా పెంచాలి, వాళ్లని ఎలా తీర్చిదిద్దాలి... ఈ విషయాలన్నీ క్షుణ్ణంగా ఆలోచించి సంసారాన్ని సమర్ధవంతంగా ముందుకు తీసుకెళ్లగల సమర్ధవంతులు. అందువల్ల తను వాళ్లతో ఉండి వాళ్లకి నేర్పేదిగానీ, నేర్పించేది గానీ ఏమీలేదు. వాళ్లు ఇచ్చింది పుచ్చుకోవాలి, చెప్పింది చేయాలి. ఇష్టం ఉంటే వాళ్లతో కలసి ఉండాలి, లేకపోతే తనకు ఇష్టం వచ్చిన చోటుకు వెళ్లిపోవాలి. అంతేగానీ పానకంలో పుడకలా వాళ్ల సంసార విషయంలో పెద్దరికం వహించడం పెద్ద పొరపాటు. మాట వరుసకు వాళ్లు ఏ సందర్భంలోనైనా సలహా అడిగినా తను 'నాకేం తెలుసురా.. మీ ఆవిడను అడుగు' అనో, 'పెద్దాయన మీ మామగారి సలహా తీసుకో' అనో చెప్పి వాళ్లను నొప్పించక తప్పించుకోవడం శ్రేయస్కరం. ఇది తన ప్రస్తుత కర్తవ్యం. వాళ్లు తనను ఎంతగానో గౌరవిస్తున్నారు. అలాగే తనుకూడా వాళ్లను గౌరవించినప్పుడు తన పెద్దరికానికి విలువ వుంటుంది. ఏది ఏమైనా తన వయస్సున్న చాలామందితో పోలిస్తే తానెంతో అదృష్టవంతుడు' అనుకున్నారు వెంకటరామయ్య.

★